క్లుప్తంగా

400 మందికి వైద్య పరీక్షలు



వైద్యపరీక్షలు చేస్తున్న డాక్టర్ మల్లికార్జున రెడ్డి

పామూరు: స్థానిక మల్లికార్జున రెడ్డి మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ 5వ వార్షికోత్సవం సందర్భంగా మండలంలోని వగ్గంపల్లె గ్రామం పాత సచివాలయ ప్రాంగణంలో ఆదివారం ఉచిత వైద్యశిబిరం నిర్వహించారు. డాక్టర్ పి.మల్లిఖార్జునరెడ్డి సుమారు 400 మందికి ఉచితంగా ఎముకలు, కీళ్ల సంబంధిత, సాధారణ వ్యాధులకు వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైనవారికి ఉచితంగా మందులు అందజేశారు. గ్రామీణ ప్రాంతాల్లోని పేదలకు ఉచితంగా మెరుగైన వైద్యసేవలు అందించాలనే ధ్యేయంతో వైద్యశాల వార్షికోత్సవం సందర్భంగా వైద్యశిబిరం నిర్వహించినట్లు తెలిపారు.

నిర్మాణ పనుల పరిశీలన



పనులను పరిశీలిస్తున్న మంత్రి స్వామి

కొండపి: మండలంలోని వెన్నూరు గ్రామం వద్ద నిర్మిస్తున్న హై లెవెల్ బ్రిడ్జి నిర్మాణ పనులను సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి స్వామి ఆదివారం పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ నాణ్యత విషయంలో ఎక్కడా రాజీ పడకుండా నిర్మాణ పనులు చేపట్టాలన్నారు. నియోజకవర్గంలో జరుగుతున్న పనుల పురోగతిని తెలుసుకున్నారు. పంచాయతీరాజ్ జేఈఈ ప్రసాద్, అధికారులు పాల్గొన్నారు


ప్రత్యామ్నాయ సాగు అవసరం



మాట్లాడుతున్న ఏవో వెంకటేష్

మద్దిపాడు: పొగాకు ప్రత్యామ్నాయ పంటలపై అంకేపల్లిలో ఆదివారం శిక్షణ కార్యక్రమం నిర్వహించారు నిర్వహించారు. మండల వ్యవసాయ అధికారి వెంకటేష్ మాట్లాడుతూ రైతులంతా పొగాకును ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయడానికి ఆసక్తి చూపుతున్నారని దీనివలన ప్రజలు అనేక ఇబ్బందులకు గురవుతున్నారని తెలిపారు. పొగాకు సాగు చేయడం వలన గాలి, నీరు, భూమి కలుషితం అవుతున్నాయని దీనివలన శ్వాసకోశ, క్యాన్సర్, గుండె జబ్బులు వ్యాధులతో పాటు అనేకమంది మత్తుకు బానిసలవుతున్నట్లు పేర్కొన్నారు. అదేవిధంగా అధిక మొత్తంలో పొగాకు పంటను సాగు చేయడం వలన ఈ ప్రభావంతో కూలీల ఖర్చు ఎక్కువ, మారుతున్న మార్కెట్ ధరలకు రైతులు ఇబ్బంది పడతారని, మానవాళికి ఇబ్బంది కలిగించే పొగాకు పంటను రైతులు సాగు తగ్గించుకోవాలని దీనికి ప్రత్యామ్నాయ అపరాల పంటలైన శనగ, మినుము, బొబ్బర్లు, ఉలవలు వంటి పంటలను సాగు చేసుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. వ్యవసాయ సహాయకుడు ఇ. చిన్నబాబు ,గ్రామ నాయకులు పాలగుండ్ల భాస్కర్ రెడ్డి, ముత్తముల వెంకటేశ్వర రెడ్డి, పాలగుండ్ల కిషోర్ రెడ్డి మరియు యర్రం శెట్టి శ్రీను, మాకా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

దుర్గం చర్చిలో రెండు గ్రూపుల మధ్య వివాదం



కనిగిరి దుర్గం చర్చిలో వాదనలు

కనిగిరి రూరల్: పట్టణంలోనే అతి పెద్ద, పురాతన కాలం నాటి చర్చి అయిన కనిగిరి దుర్గం బాప్టిస్ట్ చర్చిలో కమిటీ ఏర్పాటు విషయంలో రెండు గ్రూపులు మధ్య ఆదివారం గొడవ జరిగింది. ఎస్సై టి. శ్రీరాం తెలిపిన వివరాల ప్రకారం నూతన కమిటీ ఎన్నిక విషయంలో గత కొంత కాలంగా రెండు గ్రూపుల మధ్య వివాదం రగులుతోంది. ఈ నేపథ్యంలో ఆదివారం ప్రార్థన అనంతరం.. పాత కమిటీ గడువు ముగిసిందని.. నూతన కమిటీ ఏర్పాటు చేయాలంటూ కొందరు వాదనకు దిగారు. తమ పై పెట్టిన కేసులను ముందుగా ఉపసంహరించుకుని రావాలని పాత కమిటీ తెలిపారు. దీంతో ఇరువురి మధ్య వాదనలు జరిగి, మాటలు పెరిగి ఘర్షణ వాతావరణం నెలకొంది. ఈక్రమంలో 100కు కాల్ రావడంతో పోలీసులు రంగ ప్రవేశం చేసి, ఇరువురిని సర్దుబాటు చేశారు. శాంతి భద్రతల చర్యల దృష్ట్యా రెండు గ్రూపులను బైండోవర్ చేసి పంపినట్లు ఎస్సై తెలిపారు.

గ్రంథాలయాలతో విజ్ఞానం

టంగుటూరు: గ్రంథాలయాలతో విజ్ఞానం వస్తుందని గ్రంథపాలకుడు గుమ్మడి వర్ధన్ రాజు అన్నారు. స్థానిక గ్రంథాలయంలో నాలుగో రోజున 57వ జాతీయ గ్రంథాలయ వారోత్సవాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులకు వివిధ రకాల పోటీలు నిర్వహించారు.

చెరువు కంట కన్నీరు



కనుమళ్ల చెరువు సగం మాత్రమే నిండిన దృశ్యం



ఫ్లైవర్‌కు తూర్పు భాగంలో చెరువుకు వర్షపునీరు పోయే వీలులేక దుకాణాల చుట్టూ నీరు చేరిన దృశ్యం

- ఆక్రమణలో కనుమళ్ల చెరువు
- చెరువుకు నీరు రాకుండా కాలువల ఆక్రమణ
- 350 ఎకరాల ఆయకట్టు ప్రశ్నార్థకం
- ప్రస్తుతం కేవలం 80 ఎకరాల్లో వరిసాగు
- ఆక్రమణలో కనుమళ్ల రోడ్డు, కందుకూరు రోడ్డు కాలువలు
- ఆక్రమణదారులకు అండగా రెవెన్యూ, ఇరిగేషన్ అధికారులు

సింగరాయకొండ:

మండలంలోని కనుమళ్ల చెరువుతో పాటు చెరువుకు వచ్చే కాలువలు ఆక్రమణలకు గురయ్యాయి. దీంతో భారీ వర్షాలు కురిసినా చెరువు అరకొరగా నిండటంతో చెరువు ఆయకట్టులో పూర్తి స్థాయిలో సాగు చేయలేకపోతున్నామని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

మాగాణి మాయం

ఈ చెరువు కింద సుమారు 350 ఎకరాల ఆయకట్టు పొలం ఉంది. గతంలో పూర్తి ఆయకట్టులో వరి సాగు చేస్తుండగా తరువాత కాలంలో కాలువలు ఆక్రమణకు గురై చెరువు పూర్తి స్థాయిలో నిండని పరిస్థితి ఏర్పడింది. దీంతో రైతులు కేవలం 80 ఎకరాల్లో మాత్రమే వరిసాగు చేస్తుండగా మిగిలిన పొలంలో మెట్ట పంటల సాగుకు ప్రాధాన్యమిస్తునానరు. ముఖ్యంగా శనగ, మినుము, పెసర వంటి మెట్టపంటలతో పాటు జామాయిల్ సాగు చేస్తున్నారు.

కనుమళ్ల చెరువుకు ప్రధానంగా సింగరాయకొండ పంచాయతీలోని కనుమళ్ల రోడ్డు, కందుకూరు రోడ్డు లోని కాలువల ద్వారా వర్షపు నీరు చెరువుకు చేరుతుంది. అంతేకాక చిన్నకనుమళ్ల, మలినేని ఇంజినీరింగ్ కాలేజీ పై పొలాల నుంచి వర్షపు నీరు చెరువుకు చేరుతుంది. కానీ కనుమళ్ల రోడ్డు, కందుకూరు రోడ్డు తదితర ప్రాంతాల నుంచి చెరువుకు చేరే కాలువలు పూడి పోవడంతో పాటు ఆక్రమణకు గురయ్యాయి. దీంతో కాలువలు పూడ్చి ఇళ్ల నిర్మాణాలు చేపట్టారు. ఇటీవల కందుకూరు రోడ్డు ఫ్లైఓవర్‌కు పడమర వైపున ఉన్న అనధికార వెంచర్ దారుడు తన స్థలంలోకి వెళ్లే విధంగా భారీగా మట్టి తోలడంతో చెరువుకు వెళ్లే కాలువ పూడి పోయింది. దీంతో ఇటీవల కనుమళ్ల రైతులు తమ సొంత నిధులతో సమష్టిగా జేసీబీతో రోడ్డు మార్జిన్లో కాలువ తీసి చెరువుకు నీరు వెళ్లే విధంగా మార్గం సుగమం చేశారు. అయితే వర్షపునీరు పోయే వీలులేక పోవడంతో ఫ్లైఓవర్‌కు తూర్పు వైపున వర్షపునీరు నిలిచి అక్కడ ఉన్న షాపుల్లోకి నీరు చేరడంతో షాపు యజమానులు ఇబ్బందులు పడ్డారు. ఇంత జరుగుతున్నా ఇరిగేషన్ అధికారులు మాత్రం అనధికార వెంచర్‌కు ముందు పంట కాలువ లేదని.. కేవలం ప్రభుత్వ స్థలం మాత్రమే ఉందని చెబుతున్నారు. ఆ స్థలంలో నుంచి వర్షపు నీరు పోతుందని ప్రభుత్వ స్థలంలో మట్టి తోలితే రెవెన్యూ అధికారులు చర్యలు తీసుకోవాలే తప్ప తాము మాత్రం ఏమి చేస్తామని చెబుతున్నారని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల కురిసిన వర్షాలకు చెరువు నిండాల్సి ఉండగా కేవలం సుమారు 60 శాతం మాత్రమే నిండిందని ఆయకట్టు రైతులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి కనుమళ్ల చెరువు కాలువల ఆక్రమణలు తొలగించాలని రైతులు కోరుతున్నారు.



కందుకూరు ఫ్లైఓవర్‌కు పడమర వైపు అనధికార వెంచర్ ముందు రోడ్డు మార్జిన్‌లో మట్టితీసి వర్షపు నీరు పారించిన ఆయకట్టు రైతులు

పారిశుద్ధ్యంపై ప్రత్యేక దృష్టి సారించండి

మద్దిపాడు: మండలంలోని గీతాంజలి పాఠశాల నుంచి గుండ్ల సముద్రం వరకు ఉన్న ఆర్ఎంపీ రహదారి అధ్వానంగా ఉందని, అలాగే మండలంలోని అన్ని గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగు పడాల్సిన ఆవశ్యకత ఉందని ఎంపీపీ వాకా వెంకటరెడ్డి అన్నారు. ఆదివారం స్థానిక మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో సర్వసభ్య సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మరిపూడి నుంచి పొదిలికి వెళ్లే ఆర్అండ్‌బీ రహదారి గుంటలమయం అయిందని, ఈ రహదారిలో ప్రయాణం నరకయాతనంగా మారిందన్నారు. చెరువు కట్ట కింద కోనేరు, తాగునీరు బావికి ఏర్పాటు చేసిన ప్రహరీ గోడ కూలిపోయి ప్రయాణికులకు అత్యంత ప్రమాదకరంగా మారిందన్నారు. ఆర్అండ్‌కు రహదారికి అనుకొని ఉన్న ఈ ప్రదేశం మరమత్తు విషయమై అనేకసార్లు ఉన్నతాధికార దృష్టికి తీసుకెళ్లామని ఆర్అండ్‌బీ మార్పు లేదన్నారు. ఈ ప్రదేశంలో ప్రమాదం జరిగితే ప్రాణాలు కోల్పోయే పరిస్థితి ఉందన్నారు. విద్యుత్ శాఖ ఏఈ సుబ్బారెడ్డి మాట్లాడుతున్న సమయంలో జెడ్పీటీసీ సభ్యులు మాకినేని సుధారాణి, వేమవరం సర్పంచ్ సుబ్బయ్య కలుగజేసుకుని మండలంలోని చిలంకూరు వేమవరం గ్రామాల్లో విద్యుత్ వైర్లు అందే అంత ఎత్తులో ప్రమాదకరంగా ఉన్నాయన్నారు. శిథిలావస్థలో ప్రమాదకరంగా ఉన్న విద్యుత్ స్తంభాలు మార్చారన్నారు. ఆర్డబ్ల్యూఎస్ ఏఈ జైపాల్ మాట్లాడుతున్న సమయంలో ధర్మవరం సర్పంచ్ గంగిరెడ్డి రమణారెడ్డి మాట్లాడుతూ గ్రామంలో తాగునీటి సమస్య ఉందని, అయితే జంగాలపల్లి సీపీ డబ్ల్యూ స్కీం నుంచి ధర్మవరం గ్రామానికి నీరు సరఫరా చేయకుండానే బిల్లులు మార్చుకున్నారన్నారు. ఏపీవో రాంబాబు మాట్లాడుతున్న సమయంలో ఎంపీపీ వాక వెంకట రెడ్డి కలుగజేసుకొని మండలంలోఉపాధి పనుల అభివృద్ధి పనులపై ప్రజా ప్రతినిధులకు తెలియజేయాల్సిన అవసరం లేదా అని ప్రశ్నించారు. పంచాయతీల పరిధిలో పారిశుద్ధ్యంపై, సీజనల్ వ్యాధులపై దృష్టి సాధించాల్సిన అవసరం ఉందన్నారు. తాగునీరు సంబంధించిన ఓవర్ హెడ్ ట్యాంకులు శుభ్రం చేసి మండల ప్రజలకు శుద్ధ జలాలు అందించాలన్నారు. అధికారులు కలిసికట్టుగా పనిచేసి మండలాన్ని అభివృద్ధి బాటలో తీసుకెళ్లాలన్నారు. మండల ప్రత్యేక అధికారి ఎస్. పద్మశ్రీ, తహసీల్దార్ నరసింహారావు, ఎంపీడీవో జగదీష్, ఏవో ఎస్‌కే కాసీం పీరా, పలు శాఖల అధికారులు ఎంపీటీసీలు సర్పంచులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఎంపీపీ వాకా వెంకట రెడ్డి

అయ్యప్ప మాలధారులకు భిక్ష ప్రారంభం



అయ్యప్ప ఆలయంలో అన్నదానం ప్రారంభిస్తున్న దాత దారపనేని, ఆలయ చైర్మన్ రాజా



దాత దారపనేని చంద్రశేఖర్‌కు ప్రసాదం, మెమొంటో అందజేస్తున్న చైర్మన్, గురుస్వామి

పామూరు: స్థానిక అయ్యప్ప ఆలయంలో మాలధారులకు భిక్ష కార్యక్రమం ఆదివారం ఆలయ చైర్మన్ గుత్తి వెంకట రాజా, దాత ఏఎంసీ మాజీ చైర్మన్ దారపనేని చంద్రశేఖర్ ప్రారంభించారు. ఈసందర్భంగా మొదట అయ్యప్ప ఆలయంలో ఆలయ అర్చకులు, గురుస్వామి చిమట పట్టాభి స్వామివారికి అభిషేకం నిర్వహించారు. అనంతరం ఆలయ ప్రాంగణంలోని అన్నపూర్ణాదేవి విగ్రహమూర్తికి అన్నదాన ప్రారంభం సందర్భంగా అన్నాభిషేకం, విశిష్టపూజలు నిర్వహించారు. అయ్యప్ప, గోవింద, శివ, ఆంజనేయ, సుబ్రమణ్య మాలధారుకు భిక్ష ప్రారంభించారు. లక్ష రూపాయల విరాళం అందించి.. దారపనేనికి స్వామివారి ప్రసాదం, మెమెంటో అందజేశారు. మాజీ సర్పంచ్ కావేటి సుబ్బయ్య, రాజేంద్ర, ఓగూరి నరసింహారావు, పలువురు మాలధారులు పాల్గొన్నారు.

వైభవంగా గోపూజ



గోపూజ చేస్తున్న దృశ్యం

సీఎస్‌పురం (పామూరు): ప్రముఖ పుణ్యక్షేత్రం మిట్టపాలెం నారాయణస్వామి ఆలయంలో మహా నివేదన, గోపూజ, అభిషేకోత్సవ కార్యక్రమం ఆదివారం అర్చకులు మంకాల శివప్రసాద్‌శర్మ ఆధ్వర్యంలో వేదమంత్రాలతో ఘనంగా నిర్వహించారు. ఈసందర్భంగా ఉదయం శ్రీనారాయణస్వామి వారి మూలవిగ్రహమూర్తికి, శ్రీదేవి, భూదేవి సమేత విష్ణుమూర్తివారి ఉత్సవ మూర్తులకు అభిషేకం, ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం గోపూజా మందిరంలో గోపూజ నిర్వహించారు. భజంత్రీలు, మేళతాళాల నడుమ ఆలయం చుట్టూ నైవేద్యంతో ప్రదక్షిణలు చేసి పొంగలిని స్వామివారికి నైవేద్యంగా సమర్పించారు. దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయ వ్యవస్థాపక చైర్మన్ కొమ్మినేని చిన ఆదినారాయణ, ఈఓ శ్రీగిరిరాజు నరసింహబాబు, కొమ్మినేని వెంకట్రావు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



అభిషేకోత్సవంలో ఆలయ కమిటీ, భక్తులు

ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థినుల ఎంపిక



విద్యార్థినులను అభినందిస్తున్న ఏలూరి సుబ్బారావు, వెంకటరెడ్డి, పీడీ కాశీ విశ్వనాథ రెడ్డి

కనిగిరి రూరల్: జాతీయ స్థాయి ఖోఖో పోటీలకు కనిగిరి విద్యార్థినులు ఎంపికైనట్లు పీడీ, ప్రకాశం జిల్లా ఖోఖో సంఘ ప్రధాన కార్యదర్శి బి. కాశీ విశ్వనాథరెడ్డి తెలిపారు. ఈనెల 25 నుంచి 29 వరకు ఉత్తరప్రదేశ్‌లోని అలీగఢ్‌లో జరిగే 43వ జాతీయ స్థాయి ఖోఖో పోటీల్లో బాలికల జట్టులో ప్రకాశం జిల్లాలోని కనిగిరికి చెందిన ఎంఎన్ఎం డిగ్రీ కళాశాల విద్యార్థిని టి. సుస్మిత, ఎంఎస్ఆర్ కళాశాల విద్యార్థి ఆర్. యశోధ ఎంపికయ్యారు. వీరు ఈనెల 22 వరకు తూర్పు గోదావరి జిల్లా కాకినాడలో జేఎన్‌టీయూ యూనివర్శిటీలో జరిగే శిక్షణ శిబిరంలో పాల్గొన్నారు. ఖోఖో సంఘ రాష్ట్ర, జిల్లా నాయకులు, ఖోఖో కమిటీ, ఎంఎన్ఎం కళాశాల కరస్పాండెంట్ ఏలూరి సుబ్బారావు, ఎంఎస్ఆర్ ప్రిన్సిపాల్ టి. వెంకటరెడ్డి, అధ్యాపకులు, పీడీలు ఆదివారం అభినందించారు.

20న సీపీఎం మహాసభ

పామూరు: సీపీఎం పామూరు మండల 6వ మహాసభ ఈనెల 20వ తేదీ బుధవారం స్థానిక అమ్మ ఫంక్షన్‌హాలులో జరుగుతాయని పార్టీ మండల కార్యదర్శి కొమ్మలపాటి మాల్యాద్రి పేర్కొన్నారు. ఆదివారం స్థానిక సుందరయ్య భవన్‌లో జరిగిన కార్యక్రమంలో మాట్లాడారు. 3 సంవత్సరాలకు ఒక్కసారి జరిగే ఈ మహాసభలకు పార్టీ నాయకులు, కార్యకర్తలు హాజరై జయప్రదం చేయాలన్నారు. మహాసభల్లో గత మూడు సంవత్సరాల పోరాటాలను సమీక్షించుకుని భవిష్యత్ పోరాటాలకు ప్రణాళిక రూపొందించుకోనున్నట్లు తెలిపారు. సమావేశానికి రాష్ట్ర, జిల్లా నాయకులు హాజరు కానున్నారన్నారు. వై.వీరనారాయణ, షేక్ ఖాదర్‌బాషా, శంకర్, షేక్ అల్లాభక్షు, శ్రీనివాసులు, నాగేశ్వరరావు పాల్గొన్నారు.



పద్మావతి భౌతికకాయం వద్ద నివాళులర్పిస్తున్న ఇన్‌చార్జ్ దద్దాల, నాయకులు

పద్మావతి మృతి పార్టీకి తీరనిలోటు

పామూరు: వైఎస్సార్ సీపీ సీనియర్ నాయకురాలు, మండలంలోని బొట్లగూడూరు ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులు మాతృమూర్తి పోలినేని పద్మావతి (75) శనివారం గుండె పోటుతో మృతి చెందారు. ఈసందర్భంగా ఆదివారం వైఎస్సార్ సీపీ కనిగిరి నియోజకవర్గ ఇన్‌చార్జ్ డాక్టర్ దద్దాల నారాయణ యాదవ్ స్థానిక నాయకులతో కలిసి బొట్లగూడూరులోని మృతురాలి నివాసానికి వెళ్లి ఆమె భౌతిక కాయానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. ఆమె మృతి పార్టీకి తీరనిలోటన్నారు. ఈసందర్భంగా ఆమె కుమారుడు స్థానిక ఎంపీటీసీ పోలినేని శ్రీనివాసులును, కుటుంబ సభ్యులను పరామర్శించి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో పార్టీ మండల అధ్యక్షుడు గంగసాని హుసేన్‌రెడ్డి, కోఆప్షన్ షేక్ నాయబ్‌రసూల్, బూత్ కమిటీ మండల అధ్యక్షుడు గట్లా విజయ భాస్కర్‌రెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ పువ్వాడి రాంబాబు, జొన్నలగడ్డ గోవిందయ్య, శ్రీరాం శ్రీనివాసులు, పోలినేని చిన్న శ్రీనివాసులు, ఆవుల రామకృష్ణ, బెన్ని, గుంజి రవీంద్ర, మల్లికార్జున, తలుపుల మాల్యాద్రి, ఎస్సీ సెల్ కటికల వెంకటరత్నం, సైకం స్వర్ణ యేడుకొండలు, గొబ్బిళ్ల శ్రీను, పలువురున్నారు.

బంగారు బాల్యాన్ని సంరక్షిద్దాం

పామూరు: బాలల హక్కులను కాపాడి వారి బంగారు బాల్యాన్ని సంరక్షిద్దామని ఐసీడీఎస్ సూపర్ వైజర్ ఎంపీఎస్ పార్వతి, స్వయం కృషి స్వచ్ఛంద సేవాసంస్థ అధ్యక్షుడు నాయబ్‌రసూల్ అన్నారు. మండలంలోని డీవీ పల్లె గ్రామంలో ఆదివారం బాలల దినోత్సవ వారోత్సవాల కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ నేటి బాలలే రేపటి పౌరులని వారి హక్కులను తెలియజేసి వారిని భావిభారత పౌరులుగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. బాల్య వివాహాలు, పాఠశాల డ్రాపవుట్లు అధికంగా ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాల్లోనే జరుగుతున్నాయని దీనిని గుర్తించాలన్నారు. ఈసందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. సర్పంచ్ చల్లా రత్తమ్మ, అంగన్‌వాడీ కార్యకర్తలు ఫణికుమారి, కృష్ణవేణి, పొదుపు మహిళలు, కిశోర బాలికలు పాల్గొన్నారు.



డీవీ పల్లెలో ర్యాలీ నిర్వహిస్తున్న ఐసీడీఎస్, స్వచ్ఛంద సంస్థలు

కనిగిరి రూరల్: తల్లిదండ్రులతోనే బాలలకు బంగారు భవిష్యత్తు సాధ్యమని మున్సిపల్ చైర్మన్ ఎస్‌కే అబ్దుల్‌గఫార్ అన్నారు. స్థానిక కాశిరెడ్డి కాలనీలో మా పిల్లలు– మా బాధ్యత కార్యక్రమం ఆదివారం జరిగింది. అనంతరం పట్టణంలోని పలు వార్డుల్లో గఫార్ పర్యటించారు. దేవకి సుబ్రహ్మణ్యం, సిరుప వెంకట గోవర్ధన్ రెడ్డి, కంటు గురవయ్య పాల్గొన్నారు.

బాలల వారోత్సవాలు నిర్వహించండి

సీఎస్‌పల్లి: మండల పరిధిలోని అన్ని గ్రామ సచివాలయాల్లో బంగారు బాల్యం బాలల వారోత్సవాలు నిర్వహించాలని ఎంపీడీవో ప్రభాకర్ శర్మ తెలిపారు. దీనికిగాను అన్ని గ్రామ పంచాయతీలకు సంబంధించి నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. గ్రామ పంచాయతీల్లో మధ్యాహ్నం 2.00 గంటలకు గ్రామ సభ కార్యక్రమం గ్రామ పంచాయతీ బంగారు బాల్యం కమిటీచే నిర్వహిస్తామని.. ఇందుకు సంబంధించి 18 గ్రామ పంచాయతీలకు నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. నోడల్ అధికారి అధ్యక్షతన, బంగారు బాల్యం గ్రామ పంచాయతీ కమిటీ సమావేశం జరుగుతుందని తెలిపారు. గ్రామ పంచాయతీ స్థాయిలోని అన్ని శాఖల అధికారులు ఈ గ్రామ సభకు హాజరై గ్రామ సభలో వండర్ బాలికలు అనగా ఏక తల్లిదండ్రులు కలిగిన బాలురు అంగవైకల్యం కలిగిన వారు ఇతర బాల బాలికలను గుర్తించి వారి కుటుంబాలకు తగిన సదుపాయాలు కల్పించాలని కోరారు. గ్రామ పంచాయతీ స్థాయిలో అన్ని శాఖల అధికారులు పాల్గొనాలని కోరారు.

యూటీఎఫ్ అధ్యక్ష, కార్యదర్శుల ఎన్నిక

పామూరు: పామూరు మండల యూటీఎఫ్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులుగా ముప్పాళ్ల సురేష్, డోలా ఉదయ్‌కుమార్ ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. యూటీఎఫ్ కౌన్సిల్ సమావేశం ఆదివారం యూటీఎఫ్ డివిజన్ కార్యాలయంలో ఆదివారం జరిగింది. సమావేశంలో యూటీఎఫ్ మండలశాఖ నూతన కమిటీ ఎన్నిక జరగ్గా సంఘం మండల అధ్యక్షునిగా ముప్పాళ్ల సురేష్, ప్రధాన కార్యదర్శిగా డోలా ఉదయ్‌కుమార్‌లతో పాటు కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకోగా నూతన కమిటీ సభ్యులు ప్రమాణస్వీకారం చేశారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం ఉద్యోగ, ఉపాధ్యాయులకు చెల్లించాల్సిన బకాయిలను వెంటనే చెల్లించాలన్నారు. 12వ పీఆర్సీ కమిటీని నియమించి ఐఆర్ ప్రకటించాలన్నారు. జీఓ 117ను రద్దు చేయాలని, యాప్‌ల భారం తగ్గించాలని అదేవిధంగా సీపీఎస్‌ను రద్దు చేయాలన్నారు. ఈసందర్భంగా సంఘ భవన నిర్మాణానికి సహకరించిన దాతలు కోటపాటి జనార్దన్, యాదవ శ్రీనివాసులును ఘనంగా సన్మానించారు. యూటీఎఫ్ జిల్లా ఉపాధ్యక్షుడు షేక్ అబ్దుల్ హై, జిల్లా కార్యదర్శి అరియారం సురేష్, రాష్ట్ర కౌన్సిలర్ పోతులూరయ్య, సంఘం సీనియర్ నాయకులు గల్లా చెన్నయ్య, యం.శ్రీనివాసరాజు, నల్లబోతుల వీరబ్రహ్మం, పేటా తిరుపతిరెడ్డి, హస్తి వీరాంజనేయులు, సీఐటీయూ నాయకులు కే.మాల్యాద్రి, జేవీవి నాయకులు కాశే శంకర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న యూటీఎఫ్ మండల నూతన కమిటీ

సందడిగా కార్తీక వన భోజనాలు



కనిగిరి: వనభోజనోత్సవాల్లో మహిళలు



కనిగిరి: విజేతలకు బహుమతుల పంపిణీ

కనిగిరి రూరల్: కార్తీక మాసం పురస్కరించుకుని పట్టణంలో వివిధ సంస్థలు, ఆలయ కమిటీల ఆధ్వర్యంలో ఆదివారం కార్తీక వన మహోత్సవాలు ఘనంగా నిర్వహించారు. స్థానిక 11వ వార్డులోని దేవాంగ నగర్ రామకృష్ణా ధాన్య మందిరంలో రామకృష్ణా సేవా సమితి ఆధ్వర్యంలో జరిగిన కార్తీక వనభోజనోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరిగింది. ఈ సందర్భంగా శ్రీమత్ స్వామి సుకృతానందజీ మహారాజ్ (రామకృష్ణ మఠం అధ్యక్షులు, తిరుపతి) వారు సందేశాన్నిచ్చారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు. అనంతరం వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, ముగ్గుల, ఆటల పోటీలు సాగాయి. వివిధ పోటీల్లోని విజేతలకు బహుమతులు పంపిణీ చేశారు. కందుకూరి వెంకట సత్యన్నారాయణ, సహకారంతో అన్న ప్రసాద వితరణ జరిగింది. అలాగే పట్టణంలోని కనక పట్టణంలోని శివాలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో కార్తీక వన భోజనోత్సవాలు అత్యంత వైభవంగా జరిగాయి. మండలంలోని నందన మారెళ్ల వద్ద గల బాల కోటేశ్వర స్వామి ఆలయంలో దేవస్థాన కమిటీ ఆధ్వర్యంలో కార్తీక వన భోజనాలు నిర్వహించారు. తొలుత జరిగిన సత్యన్నారాయణ స్వామి వత్రాలు, శివ పూజల్లో భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

జర్నలిస్టుల సమస్యల పరిష్కారానికి కృషి

కనిగిరి రూరల్: జర్నలిస్టుల సమస్యల పరిష్కారం కోసం ఏపీడబ్ల్యూజేఎఫ్ కృషి చేస్తుందని ఆ సంఘ డివిజన్ అధ్యక్ష, కార్యదర్శులు ఎస్‌కే బాషా, చెరుకూరి నరసింహారావు అన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ కార్యాలయంలో ఆదివారం కనిగిరి డివిజన్ సమావేశం జరిగింది. మహేష్, వాసు, చెన్నారావు, కొండలరావు, లక్ష్మణాచారి, బాదుర్ల, అంజిరెడ్డి, అగస్టీన్, నజీర్, నరసింహరావు, చిన్న కృష్ణ పాల్గొన్నారు.

రేషన్ షాపుపై దాడి

మద్దిపాడు: మండలంలో వైఎస్సార్‌సీపీ సానుభూతి పరులైన రేషన్‌డీలర్లను టీడీపీ నాయకులు టార్గెట్ చేసి అక్రమ కేసులు నమోదు చేస్తున్నారు. మొన్న కూచిపూడి నేడు అంకేపల్లి గ్రామాల్లో ఇలాంటి సంఘటనలు చోటు చేసుకున్నాయి. రేషన్‌దుకాణాల్లో సరుకులు సక్రమంగా ఉన్నప్పటికి అక్రమ కేసులు బనాయిస్తున్నారు. తూకం తక్కువగా వస్తుండటంతో 175 కేజీలు తక్కువగా ఉన్నాయని అని చెప్పినా అధికారులు వినలేదని అంకేపల్లి రేషన్ డీలర్ పి. శ్రీదేవి వాపోయింది. ఆదివారం రేషన్‌షాపు నామమాత్రంగా తనిఖీ చేసి సదరు డీలర్‌పై 6 ఏ కేసు నమోదు చేశారు. గ్రామ టీడీపీ నాయకులు ఎలాగైనా రేషన్‌షాపు దక్కించుకోవాలని మంత్రి స్వామిని కలిసి ఆయన ఆదేశాల మేరకు ఈ దాడి చేసినట్లు ప్రచారం జరుగుతోంది. ఈ షాపును వీఆర్ఓ సీతారామయ్యకు అప్పగించారు. ఎన్‌ఫోర్స్‌మెంటు డీటీ సురేఖ, ఎం. ప్రమోద్‌లున్నారు.